

సాక్షి
కృష్ణాజిల్లా
గురువారం । 14 । నవంబర్ । 2024



కెనాల్ రోడ్డులో అగ్నిప్రమాదం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ):కెనాల్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. టార్పాలిన్, ప్లాస్టిక్ పట్టాల దుకాణంలో ప్రమాదం వాటిల్లింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4709, హై లెవల్ కాలువకు 153 క్యూసెక్కులు విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి రూ.1.21 లక్షలు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెనాలికి చెందిన భక్తులు బుధవారం రూ. 1.21 లక్షలు విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

పనులు వేగవంతం చేయండి

● కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ, జలజీవన్ మిషన్ పథకాల ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయటంతో పాటు నాణ్యతలో రాజీ పడవద్దని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అధికారులతో మండలాల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల ద్వారా చేపట్టే పనులకు నిధుల కొరత లేదన్నారు. అయినప్పటికీ పనుల నిర్వహణ ఆలస్యం కావటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. హౌసింగ్ కాలనీల్లో రహదారుల పనులు చేపట్టేందుకు మెరక చేయాల్సి ఉందని, ఉపాధి హామీలో మెరక పనులు చేసేందుకు అవకాశం లేకపోవటంతో ఆలస్యమవుతున్నాయని డీఈలు కలెక్టర్‌కు వివరించారు. గ్రామ పంచాయతీల్లో మెరక పనులు చేసుకుంటే రహదారి పనులు ఉపాధి హామీలో చేపట్టవచ్చునన్నారు. ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చేసిన పనులు కచ్చితంగా రికార్డు చేసి సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టిన పనులకు అప్పటివరకు పూర్తయిన పాత బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లింపుల కోసం అప్‌లోడ్ చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు చేసిన పనులన్నింటికీ బిల్లులు అప్‌లోడ్ చేయాలని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్ ఎస్‌ఈ రమణరావు, డ్వామా పీడీ శివప్రసాద్, ఆర్ అండ్ బీ ఈఈ లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్, రాయన్న తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా వీవీ నాయుడు

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా వీవీ నాయుడును నియమిస్తూ హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది ఏఎస్పీలకు జరిగిన బదిలీల్లో భాగంగా వీవీనాయుడుని జిల్లాకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

క్రాస్ కంట్రీ పోటీల్లో విద్యార్థుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో పీబీ సిద్ధార్థ విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారని ఆ కళాశాల క్రీడా విభాగాధిపతి డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. నూజివీడులోని డీఏఆర్ కాలేజీలో ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు బి.పవన్, డి.వి.సాయికుమార్, వి.శ్రీహరి, జి.కిషోర్, జి.షణ్ముఖం ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని చెప్పారు. వీరిలో జి.కిషోర్ దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కాలేజీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వర రావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, డీన్ రాజేష్ కాలేజీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

18న కృష్ణా వర్సిటీ అంతర కళాశాలల యోగా పోటీలు

విజయవాడస్పోర్ట్స్: కృష్ణా విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యోగా పోటీలను ఈ నెల 18వ తేదీన మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్, చైర్మన్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి కల విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు కళాశాలలోని యోగా హాల్‌లో హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి పుస్తక ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి టి. మనోహర్‌నాయుడు తెలిపారు. సొసైటీ కార్యాలయం ప్రాంగణంలోని వేమూరి అనిల్‌కుమార్ స్వాతి సాహిత్య వేదికపై ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శన ఉదయం పది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి పుస్తకం కొనుగోలుపై పది శాతం రాయితీ ఇస్తామన్నారు.

చిరుద్యోగులను చిదిమేసేలా!

- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆరంభం
- భవిష్యత్తులో ప్రీ పెయిడ్ చేసే ఆప్షన్‌తో అమరికలు
- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాట్లు
- జిల్లాలో 250 మందికి పైగా మీటర్ రీడర్లు
- స్మార్ట్ మీటర్లు పెడితే.. వీరిక ఇంటికే



విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికి వినతిపత్రం అందజేస్తున్న రీడర్స్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న చిరు కార్మికులను చిదిమేసేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగేస్తోంది. కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి, వాటిని త్వరలో ప్రీ పెయిడ్ ఆప్షన్‌లో మార్చి.. కార్యాలయం నుంచి ఓ కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా ఆపరేట్ చేయించేందుకు కసరత్తు చేస్తోంది. ఆ విధానం అమలైతే స్పాట్ బిల్లింగ్‌కు అవకాశం ఉండదు. ఇక మీటర్ మీడర్లతో పని ఉండదు. దీంతో చిరు కార్మికుల కుటుంబాలు రోడ్డు పాలయ్యే అవకాశాలున్నాయి. కమీషన్ పద్ధతిలో ఏళ్ల తరబడి సంస్థను నమ్ముకున్న వీరి కడుపు కొట్టేందుకు రంగం సిద్ధమైంది.

స్మార్ట్ మీటర్లు ఇలా.....

విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాట్లు చేస్తోన్న స్మార్ట్ మీటర్లు అత్యాధునిక సాంకేతికతతో కూడుకున్నవి. వీటిలో మోడెంతో పాటు సిమ్ చిప్ ఏర్పాటు చేయబడి ఉంటుంది. ముందుగా ఈ మీటర్లు పోస్ట్ పెయిడ్ (విద్యుత్ వాడిన తరువాత రీడింగ్ తీసి, బిల్లులు ఇవ్వడం) మోడ్‌లో పెడుతున్నారు. ఆ తరువాత వీటిని ప్రీ పేయిడ్ (ముందే నెలవారీ రీచార్జ్ చేసుకోవడం) మోడ్‌లో మార్చుతారు. దీంతో వినియోగదారులు నెలనెలా ముందే విద్యుత్ వాడకంను కూడా సెల్ ఫోన్, కేబుల్ డీటీహెచ్‌లా రీ చార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ కార్యాలయాలతో మొదలు.....

తొలుత ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన సంస్థ ఇప్పుడు ఇతర కనెక్షన్లకు అమర్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గృహ కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చినా.. రాబోవు రోజుల్లో వాటికి కూడా ఏర్పాటు చేసేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేశారు.

ప్రశ్నార్థకంగా మీటర్ రీడర్.....

వినియోగదారుడు వాడిన విద్యుత్‌కు బిల్లులు ఇచ్చే కార్యక్రమాన్ని స్పాట్ బిల్లింగ్ అంటారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 10వ తేదీ మధ్యలో మీటర్ రీడర్ ప్రతి కనెక్షన్ వద్ద ఉన్న మీటర్‌లోని రీడింగ్‌ను స్కాన్ చేసి, వాడిన యూనిట్లకు బిల్లులు ఇస్తారు. వీరంతా కమిషన్ పద్ధతిలో పని చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఒక బిల్లు తీస్తే కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో రూ.6.53 పైసలు, మండల కేంద్ర పంచాయితీల్లో రూ.5.53 పైసలు, మేజర్, మైనర్ గ్రామ పంచాయితీల్లో రూ.5.71 పైసల చొప్పున సంస్థ చెల్లిస్తోంది.

జిల్లాలో ఇలా..

కృష్ణా జిల్లాలో మొత్తం 6.39 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వీటిలో 5.88 లక్షల విద్యుత్ కనెక్షన్లకు ఏజెన్సీల ద్వారా మీటర్ రీడర్స్ బిల్లులు జారీ చేస్తుండగా మిగిలిన కనెక్షన్లకు సంస్థకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులు బిల్లులు తీస్తున్నారు. జిల్లాలోని 25 మండలాల్లో 11 ఏజెన్సీల ద్వారా సుమారు 250 మందికి పైగా రీడర్లు బిల్లులు తీస్తున్నారు. ప్రస్తుతానికి 5.36 గృహ కనెక్షన్లకు మినహా మిగిలిన అన్ని సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని కూడా అమర్చితే.. తాము ఇక ఇంటి బాట పట్టాల్సి వస్తుందని మీటర్ రీడర్లు అంటున్నారు. త్వరలో అన్ని కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయబోతున్నారని, ఇది పూర్తయితే స్పాట్ బిల్లింగ్, మీటర్ రీడింగ్ కార్యక్రమాలు ఉండబోవని ఓ సీనియర్ ఇంజినీరు తెలిపారు. దీంతో మీటర్ రీడర్లతో పని ఉండదని, వారు రోడ్డున పడితే ఆశ్చర్య పోవాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.



విద్యుత్ బిల్లులు తీస్తున్న మీటర్ రీడర్

విజ్ఞానం.. వికాసం..

- నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
- పఠనాశక్తి పెంపే లక్ష్యం
- ఆట పాటలతో గ్రంథాలయ సేవలు మరింత చేరువ చేయటమే లక్ష్యం



గ్రంథాలయ వారోత్సవాల్లో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు (ఫైల్)

కంకిపాడు: చిన్నారుల్లో పఠనాశక్తి పెంపొందించి, గ్రంథాలయ సేవలను చేరువ చేయటమే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముఖ్య లక్ష్యం. ఆట పాటలు, ఆసక్తి గల రంగాల్లో శిక్షణ ఇవ్వటంతో పాటుగా పుస్తక పఠనం అలవర్చటం కోసం గ్రంథాలయ సంస్థ చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకూ వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

విజ్ఞాన కేంద్రాలు....

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణలో 109 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రేడ్–1 గ్రంథాలయాలు 8, గ్రేడ్–2 గ్రంథాలయాలు 18, గ్రేడ్–3 గ్రంథాలయాలు 83 ఉన్నాయి. ఆయా గ్రంథాలయాల్లో రోజువారీ పత్రికలు, వార పత్రికలు, మాసపత్రికలు తోపాటుగా నవలలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పుస్తకాలు, చరిత్ర, పురాణ, ఇతిహాసాలకు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సంబంధిత గ్రంథాలయ అధికారులు పుస్తకాలను భద్రపరిచి పర్యవేక్షించటంలో ముఖ్యభూమిక పోషిస్తున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు....

ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అన్ని గ్రంథాలయాల్లో నిర్వహించేందుకు గ్రంథాలయ సంస్థ ఏర్పాట్లు చేసింది. తొలి రోజు ప్రారంభ సభ, బాలల దినోత్సవం నిర్వహిస్తారు. 15న గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన, స్వాతంత్య్ర సమరయోధులకు సంబంధించిన పుస్తకాలతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటుచేస్తారు. 16న ప్రముఖుల స్మరణ, 17న కవి సమ్మేళనాలు, సెమినార్‌లు, 18న విద్యార్థులకు పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న సామూహిక పుస్తక పఠనం ఉంటుంది. అదే రోజు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

ఈ ఏడాది నిధులు నిల్....

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఏ విధమైన బడ్జెట్ విడుదల కాలేదు. రెండు మూడు రోజుల్లో నిధులపై స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వారోత్సవాలకు సంబంధించిన ఖర్చులకు 50 శాతం మేరకు నిధులు మంజూరు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వారోత్సవాల నిధులు ఇప్పటివరకు ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయా గ్రంథాలయ శాఖాధికారులు వసతులు సమకూర్చుకొని వారోత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు.

పఠనాశక్తి పెంచటం కోసమే

చిన్నారులు, యువతలో పఠనాశక్తి పెంచటమే లక్ష్యంగా గ్రంథాలయ సంస్థ పని చేస్తుంది. గ్రంథాలయాల సేవలను చేరువ చేయటం కోసం కృషి చేస్తున్నాం. విజ్ఞానం నిండి ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవటం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవటం సాధ్యమే.

– రవికుమార్, కార్యదర్శి, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ

కార్తిక పుణ్యస్నానాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మంగినపూడి బీచ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



మంగినపూడి బీచ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్

కోనేరుసెంటర్: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన మంగినపూడి బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. కార్తిక పుణ్యస్నానాలను పురస్కరించుకుని బుధవారం మండలంలోని మంగినపూడి బీచ్‌ను జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్‌కు రోజు ముందుగానే పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు వస్తారని తెలిపారు. వారికి కావాల్సిన ఏర్పాట్లు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి వేడివేడి పాలు పంపిణీ చేయడంతో పాటు వారు తప్పిపోకుండా చేతికి ట్రాకింగ్ వేయాలని కోరారు. ప్రజల్లో తొక్కిసలాట లేకుండా రహదారికి దూరంగా, రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆయా విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. సముద్రంలో లో టైడ్, హై టైడ్ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎర్రటి జెండాలతో గుంజలు నాటి తాళ్లతో కట్టి పక్కాగా. బారికేడింగ్ చేయాలని, వాటిని దాటి ప్రజలు ఎవరు సముద్రం లోపలికి పోకుండాచర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ వాహనాలు అన్నింటిని పార్కింగ్ ప్రదేశంలో నిలుపుదల చేసి అక్కడి నుంచి ప్రజలు కాలినడకన బీచ్‌కు చేరుకునేలా చూడాలని తెలిపారు. పోలీసు అవుట్ పోస్టు వద్ద అధికారుల వాహనాలు నిలుపుకొనుటకు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డీపీవో జె.అరుణ, డీపీటీవో వాణిశ్రీ, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, దేవదాయ శాఖ ఏసీ సాంబశివరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి, రహదారులు భవనాల శాఖ ఈఈ లోకేష్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రమణరావు, జిల్లా పర్యాటక అధికారి రామ్‌లక్ష్మణ్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీఎస్పీ అబ్దుల్ సుభాని, అగ్నిమాపక అధికారి ఏసురత్నం, మెరైన్ ఎస్ఐ జగదీష్ చంద్రబోస్, ఎంపీపీ శ్రీనివాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా పాండురంగడి రథోత్సవం

- బేతాళ, కాంతార నృత్యం, కోలాట ప్రదర్శనలు
- హాజరైన మంత్రి కొల్లు, పేర్ని కిట్టు, పుర ప్రజలు



రథోత్సవంలో రుక్మిణి సమేత పాండురంగస్వామి

మచిలీపట్నంటౌన్: కీరపండరీపురం (చిలకలపూడి) రుక్మిణి సమేత శ్రీ పాండురంగస్వామి కార్తిక శుద్ధ ఏకాదశి ఉత్సవాలు మూడోరోజైన బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ద్వాదశి పారాయణ, శ్రీ లక్ష్మీ సుదర్శన హోమం, లలిత సహస్ర నామ పారాయణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి రథోత్సవం కనుల పండువలా సాగింది. రథోత్సవం మేళ తాళాలు, బేతాళ, కాంతార నృత్యాలు, కోలాట భజనలు, పలు రకాల కళా ప్రదర్శనలు, బాణసంచా శబ్దాల నడుమ కోలాహలంగా జరిగింది. ఉదయం స్వామి వారి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం నగరంలోని ప్రధాన రహదారుల గుండా ముందుకు సాగింది. నగర ప్రజలు వారి గృహాల ముందుకు వచ్చిన స్వామివారిని దర్శించి తరించారు. రథోత్సవంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పలువురు కార్పొరేటర్‌లు, వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవాన్ని ఆలయ నిర్వాహకుడు టీకే నరసింహం పర్యవేక్షించారు. గురువారం ఉదయం ఆలయంలో సహస్ర లింగేశ్వరస్వామికి అభిషేకాలు, విష్ణు సహస్ర నామ పారాయణ, రాత్రికి సహస్ర దీపారాధనలు, కోలాటములు, పండరీ భజనలు జరుగుతాయని నరసింహం తెలిపారు.



కాంతార నృత్యం

అద్దె గదుల్లో అవస్థలు

పరాయి పంచన అంగన్‌వాడీలు

- జిల్లాలో మొత్తం 1,707 అంగన్‌వాడీ కేంద్రాలు
- అద్దె కేంద్రాల్లో నడుస్తున్న కేంద్రాలు 686
- ఇరుకు గదుల్లో చిన్నారులకు తప్పని ఇక్కట్లు



ప్రభుత్వ పాఠశాల భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం

గుడ్లవల్లేరు: జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు పరాయి పంచన నడుస్తున్నాయి. చాలీచాలని ఇరుకు గదుల్లో నడుస్తున్న ఈ కేంద్రాల్లో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో మొత్తం 1,707 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 686 కేంద్రాలు అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖల గదుల్లో నడుస్తున్నాయి. 453 కేంద్రాలను అద్దె చెల్లించి ప్రయివేటు గదుల్లో నిర్వహిస్తున్నారు. అద్దె లేకుండా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో 233 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇరుకు అద్దె గదుల్లో చిన్నారులు ఇక్కట్లకు గురవుతున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈ కేంద్రాల నుంచి చక్కటి సేవలతో పాటు చిన్నారులకు ప్రీ స్కూల్ నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమై దాదాపు 40 ఏళ్లు గడిచినా నేటికీ చాలా చోట్ల సొంత భవనాలు లేకుండా పోయాయి. పాడుబడ్డ భవనాలు, రేకుల షెడ్డుల్లో కేంద్రాలను నిర్వహిస్తుండటంతో ఎండ, వానకు చిన్నారులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. అసౌకర్యాలతో కూడుకున్న అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించటంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పక్కా భవనాలు లేని కొరతతో ఆ సమస్య ఏళ్ల తరబడి పీడిస్తోంది. దీనితో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు అవసరమైన గాలి, వెలుతురు సరిగా లేని ఇరుకు గదుల్లో ఉండటంతో చిన్నారులతో పాటు కార్యకర్తలు, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువ చోట్ల మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేకుండా పోయాయి.

అద్దె గదుల్లో అసౌకర్యాలు

గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు ఉండే అద్దె భవనాలు అందుబాటులో లేకుండా పోయాయి. అలాంటివి ఉన్నా, అంగన్‌వాడీలకు అద్దెకు ఇచ్చేందుకు ఏ ఇంటి యజమానులు ముందుకు రావటం లేదు. ఒక వేళ ఇచ్చినా అద్దెల దరువు భారీగా ఉంటోంది. గది అద్దెకు కావాలంటే రూ.3 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతంలో అయితే రూ.8 వేల వరకు ఇళ్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అద్దెలను నెలనెలా చెల్లించలేక యజమానులు ఖాళీ చేయమంటున్నారు. ఫిబ్రవరిలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులను చెల్లించింది. ఆ తరువాత ఎన్నికలు వచ్చి కూటమి అధికారం చేపట్టింది. పాలన పగ్గాలు చేపట్టినప్పటి నుంచి కూటమి ప్రభుత్వం అద్దె బిల్లుల చెల్లింపులో ఇంతవరకూ బోణీ కొట్టలేదు. జిల్లాలో ఫిబ్రవరిలో అంగన్‌వాడీలకు సరుకులు, కూరగాయల బిల్లులు చెల్లించామని కృష్ణా జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సువర్ణ వివరణ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ బకాయిలు ఉన్న మాట నిజమేనన్నారు. అంగన్‌వాడీల అద్దె, కూరగాయలు, సరుకుల బకాయిలను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. అంగన్‌వాడీలకు సొంత స్థలాలు లేకనే ఆ కేంద్రాలను అద్దె గదుల్లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో బిల్లుల చెల్లింపు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కూరగాయలు, సరుకులకు ప్రతి నెలా బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆ కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తమకు రావాల్సిన బిల్లుల కోసం వ్యాపారులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

కొత్త భవనాలు నిర్మించాలి



అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్న అద్దె గదులు ఇరుకుగానే ఉంటున్నాయి. వెంటనే కొత్త భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అద్దె భవనాల్లో వసతులు లేక చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేళ్లగా చూస్తున్నా మా ప్రాంతంలో పాత అంగన్‌వాడీ భవనం కూలిపోతోందే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదు.

– గూడెపు అరుణ, గుడ్లవల్లేరు

బిల్లులు ఇవ్వకుంటే ఎలా?



అద్దె గదుల్లో ఉండే అంగన్‌వాడీ పిల్లలను చూడలేకపోతున్నాం. ఆ చిన్నారులకు కొత్త భవనాలను నిర్మిస్తే తిప్పలు లేకుండా పోతాయి. కనీసం అద్దె అయినా ప్రభుత్వం ప్రతి నెలా చెల్లించాలి. నెలల తరబడి అద్దె బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోతే అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణ ఎలా సాధ్యమవుతుంది?

– ఒ.నాగలక్ష్మి, గుడ్లవల్లేరు

సుబ్రహ్మణ్యుని సన్నిధిలో భువనేశ్వరి పీఠాధిపతి



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి తన శిష్య బృందంతో బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన గర్భాలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ మర్యాదలతో స్వామివారి చిత్రపటంతో సత్కరించారు. బీజేపీ జిల్లా నాయకులు చిరువోలు బుచ్చిరాజు, వేదపండితులు, అర్చక స్వాములు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ టీచర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఏపీ గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులంలో 1143 మంది ఉపాధ్యాయులు ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని, ఈ పోస్టులను మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అలంకార్ సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో తమ పోస్టులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయులను ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని విన్నవించారు. 2015 పీఆర్‌సీని అనుసరించి వేతనాలు పెంచాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం అందజేయాలని తెలిపారు. ధర్నాకు ఏపీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఏవీ నాగేశ్వరరావు మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాలో వైస్ ప్రెసిడెంట్ ఎస్.పరమేష్, సంయుక్త కార్యదర్శి ఎస్.పీటర్ పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.